
# మనం

కృష్ణా / గుంటూరు

ఎన్టీఆర్ - బాపట్ల - పల్నాడు

గురువారం | 31 | జూలై | 2025 | పేజీలు: 5







## గర్భ గుడిలోపలి ఫోటోలు సోషల్ మీడియాలోకి ఎలా వచ్చాయి...?



వివరాలు లోపల పేజీలో...



# ఆక్రమణల చెరలో తిమ్మరుసు బావి

5 లో

బావి ఆవరణలో గల మహాలక్ష్మీ ఆలయం

ఆలయం, బావి ఆక్రమణలు తొలగించాలంటూ పోరాడుతున్న ఆలయ పరిరక్షక, అభివృద్ధి కమిటీ

-ఇబ్రహీంపట్నం, మనం న్యూస్

# అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ప్రకాశం బ్యారేజీకి 3 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చే అవకాశం

వరదనీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి

జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ

4 లో



-మచిలీపట్నం, మనం న్యూస్




5 లో

## ప్రతి బ్యాంకు బ్రాంచ్లోనూ
# క్రెడిట్ డే నిర్వహించాలి

- కౌలు రైతులకు రుణాల మంజూరును వేగవంతం చేయండి
- బ్యాంకులు, బ్రాంచ్ల వారీగా సీసీఆర్సీ పంట రుణాల లక్ష్యాలు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

-విజయవాడ సెంట్రల్, మనం న్యూస్

# యుటిఎఫ్ పెనుగంచిప్రోలు మండల శాఖ సభ్యత్వ నమోదు



**పెనుగంచిప్రోలు, జూలై 30 (మనం న్యూస్):** ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ పెనుగంచిప్రోలు మండల శాఖ మొదటిరోజు 2024 -25 సంవత్సరానికి సభ్యత్వ నమోదు క్యాంపెయిన్ విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు మన్నేపల్లి కృష్ణ, సహాధ్యక్షురాలు పి.లీల,జిల్లా కార్యదర్శి ప్రైమరీ, మండల కార్యవర్గ సభ్యులు చాగర్ల రామారావు, దైద దానయ్య, జామా మోహన్ రావు, దిడ్డి రవీంద్ర,బేతపూడి నవకోటి, బిట్ట వెంకటరమణ, పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణయ్య బదిలీ అయిన ఉపాధ్యాయులకు సత్వరమే పొజిషన్ ఐడి లను పూర్తి చేయాలని, పెండింగ్ లో ఉన్నసంపాదిత సెలవుల నగదును మంజూరు చేయాలని, బకాయి పడిన డి ఏ లను చెల్లించాలని , పి4 అడాప్షన్ కార్యక్రమాన్ని విరమించుకోవాలని, ఉద్యోగులపై మోపిన యాప్ ల భారాన్ని తగ్గించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

# కృష్ణానదికి వరద పెరిగే అవకాశం

- **నది తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**
- **ఇబ్రహీంపట్నం తాసిల్దార్ వెంకటేశ్వర్లు**




**ఇబ్రహీంపట్నం, జూలై 30 (మనం న్యూస్):** మండలంలోని కృష్ణానది పరివాహక ప్రాంతాలలో బుధవారం ఉదయం ఇబ్రహీంపట్నం తహసీల్దారు వెంకటేశ్వర్లు వరద ఉధృతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణానది ఎగువ ప్రాంతాల్లో ఉన్న పులిచింతల, నాగార్జున సాగర్ నుండి మీరు విడుదల చేయడం వలన వరద ఉదృతి పెరిగే అవకాశం ఉందని అన్నారు. ఇబ్రహీంపట్నం మండలం పరిధిలో కృష్ణానది వరద పెరిగే అవకాశం ఉన్నందున ఇబ్రహీంపట్నం, గాజుల పేట, జగనన్న కాలనీ, తుమ్మలపాలెం, జూపూడి, చిన్న లంక తదితర నదీపరివాహక ప్రాంత ప్రజలు అప్రమంతంగా ఉండాలని ఆయన తెలిపారు. అయితే వరదకు సంభందించిన వదంతులను మాత్రం నమ్మవద్దన్నారు. ప్రజలు ఎవరూ ఆంధోళన చెందవద్దన్నారు.

## దివ్యాంగులను ఆదుకునేది చంద్రబాబు ప్రభుత్వమే

- **ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు**

**విజయవాడ సెంట్రల్, జూలై 30 (మనం న్యూస్):** బుధవారం సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద కాళ్లు దెబ్బతిని, నడవలేని పరిస్థితులలో ఉన్న 27వ డివిజన్ బావాజీ పేటకు చెందిన శ్రీనివాస్ రావుకు బ్యాటరీ ట్రై సైకిల్ ను ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తన సొంత నిధులతో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న ప్రజానీకం అందర్నీ ఆదుకునేందుకు ప్రయత్నం చేస్తున్నామని దానిలో భాగంగా సెంట్రల్ నియోజకవర్గ పరిధిలోని గత పది రోజుల నుండి 27 ట్రైసైకిళ్లను, కాళ్లు దెబ్బతిని అంగ వికలాంగులుగా ఉన్న ఉచితంగా బ్యాటరీతో నడిచే మూడు చక్రాల మోటారు బండిని సొంత నిధులతో ఉచితంగా అందించడం జరుగుతుందని తెలిపారు. దానిలో భాగంగా ఈరోజు 27 వ డివిజన్ బావాజీ పేటకు చెందిన శ్రీనివాసరావుకు ఈ ట్రై సైకిల్ ను అందించడం, ఆరోగ్యపరంగా నియోజకవర్గంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలను అన్ని రకాల సౌకర్యాలతో అభివృద్ధి చేయడమే కాకుండా అన్ని రకాల వ్యాధులకు ఈ ప్రాథమిక వైద్యశాలలో ఉచితంగా రక్త పరీక్షలు చేసి, ఉచితంగా మందులు కూడా అందించేటువంటి చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ దవాఖానాలో అధునాతనమైనటువంటి వైద్యాన్ని కూడా అందిస్తూ పేదలను ఆదుకుంటున్నామని అన్నారు. సెంట్రల్ నియోజకవర్గ పరిధిలోని రోడ్లమీద వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారస్తులకు ఇప్పటికే పెద్ద ఎత్తున తోపుడు బండ్లను అందించి వారి వ్యాపార అభివృద్ధికి, ఆర్థిక స్థితిగతులకు సహకరిస్తున్నామని, అలాగే వినికిటి సమస్యతో బాధపడుతున్న వారికి వెంటనే వినికిడి యంత్రాలను వారికి అందజేశారు.



# నందిగామలో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం




**నందిగామ టౌన్, జూలై 30 (మనం న్యూస్):** మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో నందిగామ కె.వి.ఆర్ కళాశాలలో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నందిగామ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ షేక్ రియాజ్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా కార్యకలాపాలు ప్రపంచానికి పెను సవాలుగా మారాయని, వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనాలంటే ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని అన్నారు. కఠినమైన చట్టాలు అమల్లో ఉన్నప్పటికీ ప్రపంచ మాఫియా, డ్రగ్స్ మాఫియా,మాత్రం ప్రజల యొక్క ఆర్థిక అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఆశ చూపించి వారిని ఇటువంటి భయంకరమైన పనులు చేయిస్తున్నారని అన్నారు. బలవంతంగా ఒకరి హక్కులను స్వేచ్ఛను హరించే హక్కు ఎవరికీ ఉండదని మానవ అక్రమ రవాణా పై అవగాహన కల్పించేటందుకే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారన్నారు. ప్రజల యొక్క హక్కులను పరిరక్షించటం, శ్రమ,లైకిక, దోపిడీకి గురవుతున్న వారిని గుర్తించి రక్షించడమే ప్రధాన ఉద్దేశం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కెవిఆర్ కాలేజ్ ప్రిన్సిపాల్ పి రాయప్ప మాట్లాడుతూ ఇప్పుడున్న కంప్యూటర్ యుగంలో యువత కృషి, సంకల్పం,పట్టుదలతో బాగా చదువుకొని తల్లిదండ్రులకు సమాజానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

# జగన్ చేసిన పాపాలను కడుగుతూ, సంక్షేమాన్ని అందిస్తున్న కూటమి ప్రభుత్వం

- **సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ మోహన్**



**విజయవాడ తూర్పు, జూలై 30 (మనం న్యూస్):** గత ఐదు సంవత్సరాల్లో వైఎస్. జగన్మోహన్ రెడ్డి చేసిన పాపాలను కడగడానికి చాలా సమయం పడుతుందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను జగన్మోహన్ రెడ్డి చిన్నాభిన్నం చేశారని అన్నారు. బుధవారం ఉదయం తూర్పు నియోజకవర్గ పరిధిలోని 7వ డివిజన్ మొగల్రాజపురంలోని రావి చెట్టు సెంటర్, దాసరి లింగయ్య వీధిలో 140వ నెంబరు పోలింగ్ బూత్ పరిధిలోని ప్రాంతాల్లో 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమం జరిగింది . ఎమ్మెల్యే గద్దె రామమోహన్ హాజరై ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాల వివరాలతో ముద్రించిన కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో చేసిన తప్పులను సరిచేసి వ్యవస్థలను గాడిలో పెట్టడానికి చాలా సమయం పడుతుందని అభిప్రాయపడ్డారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని ఆర్థికంగా సంక్షోభంలోకి నెట్టి వేశారని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తనకున్న సమర్థతతో ఆర్థిక సంక్షోభాన్ని అధిగమించి రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్లు ఒక్కసారిగా రూ.1000లు పెంచి అమలు చేశామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తారీకునే జీతాలతో పాటు రిటైర్ అయిన ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షన్లు కూడా అందజేస్తున్నామని అన్నారు.

# పేదింటి విద్యార్థినికి హెల్పింగ్ హ్యాండ్స్ చేయూత



**పెడన జూలై 30(మనం న్యూస్):** నందిగామ కు చెందిన విద్యార్థిని కుంచాల నక్షత్ర పదవ తరగతి ప్రభుత్వ పాఠశాల లో చదివినా మంచి మారక్స్ ఉత్తీర్ణత సాధించింది అయినా ఇంట్లో ఆర్థిక ఇబ్బందుల వల్ల ఇంటర్ మొదటి ఏడాది ఫీజు కట్టలేక మచిలీపట్నం లోని హెల్పింగ్ హ్యాండ్స్ వెంకట్ ఫౌండేషన్ సహాయం కోరగా మొదటి ఏడాది ఫీజు నిమిత్తం 21,000 రూపాయలు విద్యార్థిని నక్షత్ర కు హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండర్ ప్రెసిడెంట్ చందన వెంకట్ తమ కార్యాలయం మచిలీపట్నం లో చిలకలపూడి నందు అందించడం జరిగింది

# వెట్టిచాకిరీని సహించబోము..



- **మానవ అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టాం**
- **ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

**విజయవాడ సెంట్రల్, జూలై 30 (మనం న్యూస్):** ఆర్థిక ప్రయోజనాల కోసం మనుషులను అంగడి సరుకుగా మార్చి క్రయవిక్రయాలను జరిపి మానవ అక్రమ రవాణాకు పాల్పడడం, వెట్టిచాకిరి, బానిసత్వం వంటి చర్యలకు పాల్పడే వారిపై గట్టి నిఘా ఉంచి నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. నల్గొండ జిల్లా నేరేడుగుమ్మ మండలంలో విముక్తి కలిగిన వెట్టిచాకిరి కార్మికులను బుధవారం కార్మిక శాఖ అధికారులు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ముందు హాజరుపరిచారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొందరు వ్యక్తులు మనుషులను అంగడి సరుకుగా మార్చి ఇతరులను విక్రయిస్తున్నారన్నారు. పనులు కల్పిస్తామని ఆశ చూపి ఇతర ప్రాంతాలకు తరలించి వెట్టి చాకిరీకి పాల్పడుతున్నారన్నారు. ఇటువంటి వాటిని నివారించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా జూలై 30వ తేదిన ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం నిర్వహించి మానవ అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వెట్టిచాకిరీకి పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా పెట్టడం జరిగిందని మానవ అక్రమ రవాణా వెట్టి చాకిరి వంటి చర్యలకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకునేలా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. ఇటీవల నల్గొండ జిల్లా నేరుడుగుమ్మ మండలంలో వెట్టిచాకిరికి పాల్పడే వారిపై నల్గొండ జిల్లా అధికారులు దాడులు చేసి వెట్టి చాకిరి కార్మికులకు విముక్తి కల్పించడం జరిగిందన్నారు. ఇందులో నాలుగురు వ్యక్తులు తాము విజయవాడ ప్రాంతానికి చెందిన వారమని తెలియజేయడంతో ఎన్టీఆర్ జిల్లా కార్మిక శాఖ అధికారులకు అప్పగించారన్నారు. నల్గొండ జిల్లా నేరేడుగుమ్మ మండలంలో విముక్తి కలిగిన వారిలో విజయవాడకు చెందిన దేవరగిరి శీలం వెంకయ్య ఉన్నారని వారి ఆధార్కార్డుల ఆధారంతో కుటుంబ సభ్యులకు అప్పగించడం జరుగుతుందని, గొల్లబ్రోలు వెంకటేశ్వర్లు, బూక్యా వెంకన్నల వద్ద ఆధార్ కార్డులు కూడా లేవని వారిని పూర్తిగా విచారించి వారి స్వస్థలాలకు పంపించేందుకు చర్యలు తీసుకోవాలని కార్మిక శాఖ అధికారులను ఆదేశించామన్నారు. ఇతర ప్రాంతాలలో పనులు కల్పిస్తామని చెప్పి ఏవరైనా ముందుకు వస్తే అటువంటి వారి పూర్తి వివరాలు తెలుసుకోవాలని మోసపూరిత మాటలు నమ్మి వెట్టి చాకిరి ఉచ్చులో చిక్కుకోవద్దని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

# యూరియా కొరత వలన రైతులు ఇబ్బందులు పడుతున్నారు



- **పామర్రు వైకాపా నేత కైలే అనిల్ కుమార్**

**పామర్రు, జూలై 30 (మనం న్యూస్) :** పామర్రు తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో ఏర్పడిన యూరియా కొరతవలన నియోజకవర్గం లోని రైతులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి పామర్రు నియోజవర్గం వైకాపా నేత, మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ తహసీల్దారుకి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతే రాజు, రైతు సంతోషంగా ఉంటేనే రాజ్యం సుభిక్షంగా ఉంటుందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు అది చేసాం, ఇది చేసాం అని గొప్పలు చెప్పుకుంటున్నారు కానీ ప్రస్తుత ప్రభుత్వ మోసపూరిత పరిపాలనలో పామర్రు నియోజకవర్గంలోని రైతులు ఎదుర్కొంటున్న కష్టాలను వారు పడుతున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకువస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో సీజన్ ప్రారంభానికి ముందే రైతు భరోసా పథకం ద్వారా రైతులకు అందించిన పెట్టుబడి సాయంతో తగిన సమయంలో నాట్లు వేసుకునేవారని అన్నారు. అయితే ఈ ప్రభుత్వ పాలనలో రైతులకు పెట్టుబడి సాయం అందక, సీజన్ ప్రారంభంలో నాట్లుకు సరిపడా వర్షాలు లేక, తర్వాత అధిక వర్షాల వలన అనేక కష్టాల మధ్య నియోజకవర్గంలోని రైతులు అందరు అనేక కష్టాలు పడి నాట్లు వేశారని తెలిపారు. నాట్లు వేసిన నాటినుంచి కూడా రైతులను యూరియా కష్టాలు వెంటాడుతున్నాయన్నారు. సీజన్ ప్రారంభానికి ముందే పంటల సాగు విస్తీర్ణాన్ని అంచనా వేసి రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాల్సిన బాధ్యత అధికారులు, ప్రభుత్వానిదేనని అన్నారు. కానీ ఈ విషయంలో ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా విఫలమైందన్నారు. నాట్లు వేసిన పంటలకు యూరియా వినియోగం చాల ఎక్కువగానే ఉంటోందన్నారు. దీంతో యూరియా కోసం రైతులు రోజుల తరబడి రైతుసేవా కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చుట్టూ తిరుగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు కావాల్సిన మొత్తంలో యూరియా మొదలగు ఎరువులను తగు మొత్తంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోకపోవడం వలన, నాట్లు వేసిన రైతులందరూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

# అగ్రిగోల్డ్ ఆస్తులపై అధికారులతో జిల్లా ఇన్చార్జి కలెక్టర్ సమీక్ష



**మచిలీపట్నం, జులై 30(మనంన్యూస్):** కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.అగ్రిగోల్ ఫారమ్స్ కంపెనీ భూములకు సంబంధించిన సమగ్ర నివేదికను వెంటనే అందజేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు.జిల్లా ఇన్చార్జి కలెక్టర్ మాట్లాడుతూ,అగ్రి గోల్ కంపెనీ ఆస్తులను వేలం వేసి తదుపరి చర్యలు తీసుకొనుటకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో గన్నవరం మండలం సూరంపల్లి గ్రామంలో అగ్రిగోల్ కు సంబంధించిన 23.92 ఎకరాల భూమి, భవనాలు, కర్మాగారాలు, యంత్ర సామాగ్రి ఉన్నాయని తెలిపారు.రెవెన్యూ రికార్డుల ప్రకారం అగ్రిగోల్ కంపెనీ ఆస్తులు ఆంధ్ర బ్యాంకు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లలో తనఖా పెట్టి 90 కోట్ల రూపాయలు రుణాలు పొంది తిరిగి చెల్లించనందున బ్యాంకులవారు ఆ ఆస్తులను నాన్ పెర్ఫార్మింగ్ అసెట్స్ (ఎన్ పి ఏ) గా ఉన్నట్లు తెలిపారు. భూములను మ్యుటేషన్ ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

# ప్రభుత్వ మోసపూరిత వాగ్దానాలను ఇంటింటికీ వివరిద్దాం



- **వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు**

**జగ్గయ్యపేట, జూలై 30 (మనం న్యూస్):** సూపర్ సిక్స్ పథకాలతో సహా పలు పథకాల పేర్లు చెప్పి ప్రజలను మోసం చేసిన చంద్రబాబు మోసాలను ప్రజలకు ఇంటింటికి తిరిగి వివరిద్దామని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. వత్సవాయి మండలం పోలంపల్లి గ్రామంలో భాగంగా వత్సవాయి మండల పార్టీ అధ్యక్షులు గుత్తా శంకర్రావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలోనే ప్రజలకు మేలు జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అని ప్రజలను మోసం చేశారు. ఎలక్షన్ల ముందర ఇచ్చిన షూరిటీ బాండ్లను ప్రజలకు చూపిస్తూ చంద్రబాబు నాయుడు ప్రజలను మోసం చేశారని అని తెలిపారు. ఐదేళ్లు విద్యుత్ ఛార్జీలు పెంచేది లేదని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం, ఇప్పుడు విద్యుత్ బిల్లులు డబుల్ వస్తుండడంతో ఇదెక్కడి దారుణం ఇంత బిల్లు తామెలా చెల్లిస్తామని ప్రజలు ఆందోళన చెందుతున్నారు అని ఆరోపించారు. జాబులన్నారు జాబు లేదు, ఉచిత బస్ అన్నారు ఇలా చూసుకుంటూ పోతే ఏ పథకం అమలు చేసిన దాఖల లేదు అని అన్నారు. కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను ప్రజలు గమనించాలని వాటిని గుర్తు చేస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన క్యూఆర్ కోడ్ ను ప్రజలతో స్కాన్ చేయించి చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలు తెలుసుకునేలా చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కాటేపల్లి రామలక్ష్మి, మాజీ సోసైటీ అధ్యక్షులు కాటేపల్లి రవి, జడ్పిటిసి ఏసుపోగు దేవమణి- శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ మాడుగుల లాజర్, జిల్లా కార్యదర్శి రూప్లా నాయక్, నియోజకవర్గ ఐటీ విభాగ అధ్యక్షులు బండిపాలెం గ్రామ పార్టీ అధ్యక్షులు బండి రంజిత్, మండల యువజన విభాగ అధ్యక్షులు సర్పంచ్ కొట్టె నగేష్, రాగం కోటయ్య, తమ్మినేని ప్రతీప్, పిట్టల నరసింహ, గ్రామ నాయకులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ హనుమాన్లు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పట్టణ అభివృద్ధికి వివిధ పథకాల ద్వారా 94 కోట్ల నిధులు



- **మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర**

**జగ్గయ్యపేట, జులై 30(మనం న్యూస్):** జగ్గయ్యపేట పట్టణానికి వివిధ పథకాల ద్వారా సుమారు 94 కోట్ల ఐదు లక్షల రూపాయలు నిధులు మంజూరు అవుతున్నాయని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర వివరించారు. జగ్గయ్యపేట పట్టణంలో వివిధ అభివృద్ధి పనులకు 15వ ఆర్థిక కమిషన్ గ్రాంట్ ద్వారా ఒక కోటి 80 లక్షల రూపాయలు, సి ఆర్ డి ఐ గ్రాంట్ ద్వారా మూడు కోట్ల రూపాయలు, డి ఎం ఎఫ్ గ్రాంట్ నిధులు ఏడు కోట్ల 80 లక్షలు, అమృత్ 2.0కొలను అభివృద్ధికి మూడు కోట్ల 90 లక్షల రూపాయలు, అమృత్ 2.0 నీటి సరఫరా 11 కోట్ల 90 లక్షలు, పట్టణంలో ఎర్ర కాలువ అభివృద్ధికి ఐదు కోట్ల 65 లక్షలు, యు బి ఐ డి గ్రాంట్ కింద 60 కోట్ల రూపాయలు నిధులు మంజూరు అయ్యాయని ఈ నిధులకు సంబంధించి వచ్చే నెలలో టెండర్లను పిలిచి పనుల ప్రారంభానికి శ్రీకారం చుట్టాను న్నట్లు మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర వివరించారు.

# వైకాపా అధ్వర్యంలో బాబు షూరిటీ మోసం గ్యారెంటీ




**విజయవాడ పశ్చిమ, జూలై 30 (మనం న్యూస్):** స్థానిక 44వ డివిజన్, విద్యాధరపురం, లేబర్ నందు స్థానిక డివిజన్ ఇంచార్జ్ పెద్ది సత్య సాయి బాబు ఆధ్వర్యంలో బుధవారం నాడు బాబు షూరిటీ మోసం గ్యారెంటీ చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ 44వ డివిజన్ విస్తృత స్థాయి సమావేసం నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి, విజయవాడ పశ్చిమ వైసిపి ఇంచార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు, క్లస్టర్ ఇంచార్జ్ బోండా నిరీష్ ఆయా డివిజన్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి డా వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులార్పించారు అనంతరం బాబు మోసాలను, ప్రజలకు ఇచ్చిన బాండ్లు, వైయస్ జగన్ గారి ప్రెస్ మీట్ ని టివిలో చూపించారు. ఇంటింటికి క్యూ ఆర్ కోడ్ తో వెళ్లి ప్రజలతో ఆ క్యూ ఆర్ కోడ్ ని స్కాన్ చేపించి కూటమి మోసాలను వివరించాలని కోరుతూ క్యూ ఆర్ కోడ్ ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వెలంపల్లి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం అయిందని ఇచ్చిన ఏ ఒక్క హామీలను అమలు చేయలేదన్నారు. సంక్షేమ పథకాలు క్రమం తప్పకుండ కరోనా లాంటి క్లిష్ట పరిస్థితిలో కూడా వైయస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేసారనన్నారు, చంద్రబాబు ఎన్నికల అనువు కానీ హామీలు ఇచ్చారని, ఎన్నికలయిన తరువాత అమలు చేయడం సాధ్యం కాదని అన్నడం సిగ్గు చేటు అన్నారు.

# మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం

- **ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు**



**విజయవాడ రూరల్, జూలై 30 (మనం న్యూస్):** ఎన్నికల హామీల అమలులో భాగంగా వచ్చే నెల రెండో వారం నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ వసతి కల్పిస్తున్నట్లు ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. విజయవాడ రూరల్ మండలం అంబాపురం, పి.నైనవరం గ్రామాల్లో బుధవారం సాయంత్రం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న యార్లగడ్డ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి కష్ట సుఖాలు తెలుసుకుంటూ ముందుకు సాగిన ఎమ్మెల్యే యార్లగడ్డ ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని అధికారులు ఆదేశించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో రాష్ట్రమంతా ఉచితంగా తిరిగే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తుందని భరోసా ఇచ్చారు. రాష్ట్రం లోటు బడ్జెట్లో ఉన్నప్పటికీ సంక్షేమ పథకాల అమలులో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. పారిశ్రామికంగా గన్నవరం నియోజకవర్గం రాష్ట్రంలోనే ముందంజలో ఉందని తద్వారా నిరుద్యోగ యువతకు మెరుగైన ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయి అన్నారు. మరో రెండేళ్లలో మల్లవల్లి పారిశ్రామికవాడ లో పూర్తిస్థాయి పరిశ్రమలు ఏర్పాటు అవుతాయని చెప్పారు. నియోజకవర్గం లోని అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఏడు పదుల వయసులోనూ రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కు ప్రజలందరూ అండగా ఉండాలని పిలుపునిచ్చారు. గన్నవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి పరంగా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలబెడతానని నియోజవర్గ ప్రజలందరూ తన సహకరించాలని ఈ సందర్భంగా యార్లగడ్డ విజ్ఞప్తి చేశారు.

# సుపరిపాలన తొలి అడుగులో జంపాల

**ఇబ్రహీంపట్నం, జూలై 30 (మనం న్యూస్):** టీడీపీ జాతీయ అధ్యక్షులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి ఆదేశాలతో సుపరిపాలన లో తొలి అడుగు కార్యక్రమాన్ని కొండపల్లి మున్సిపాలిటీలోని 9వ వార్డులో బుదవారం నాడు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య పాల్గొని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి వారి యొక్క అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఆటో కార్మికులకు ఇబ్బంది పడకుండా వారికి ఆగస్టు 14వ తేదీ 15 వేల రూపాయలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అందజేయనున్నారని పేర్కొన్నారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని జంపాల సీతారామయ్య తెలిపారు. రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాలు జెట్ స్పీడ్ లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో అమలు జరుగుతున్నాయన్నారు.



## కబేళ ఆధునికరణకు కౌన్సిల్లో నిధుల మంజూరు

- జంతువులను బయట వధించి అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు
- కౌన్సిల్ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర



**జగ్గయ్యపేట జులై 30 మనం న్యూస్:** పట్టణంలో జంతువులను ఎక్కడపడితే అక్కడ వధించి అమ్మకాలు జరిపితే ఊరికు నేది లేదని కబేళను అన్ని వసతులతో ఆధునికరిస్తున్నామని అక్కడ వధించి డాక్టర్ పరిశీలించి ముద్ర వేసిన తర్వాతే పట్టణంలో ఎక్కడైనా జంతువుల మాంసాలను అమ్మకాలు చేయాలని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అన్నారు. బుధవారం సాయంత్రం మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అధ్యక్షుడు జరిగిన కౌన్సిల్ అత్యవసర సమావేశంలో పట్టణంలోని పలు సమస్యలపై కౌన్సిల్ సభ్యులు చైర్మన్ రాఘవేంద్ర దృష్టికి తీసుకురాగా ఆయన సానుకూలంగా స్పందిస్తూ అధికారులకు సమస్యల పరిష్కారానికి ఆదేశాలను జారీ చేశారు. పట్టణంలో జంతువులను వధించే కబేల శిథిలావస్థకు చేరిందని పట్టణంలో ఎక్కడపడితే అక్కడ వధించి అమ్మకాలను సాగిస్తున్నారని దాన్ని నియంత్రించేందుకు కబేల ఆధునికరణకు నాలుగు లక్షల 85 వేల రూపాయల మంజూరుకు ప్రతిపాదనలు పెట్టారు. దీనిపై వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ మాట్లాడుతూ గతంలో నిధులు మంజూరు చేసిన సక్రమంగా పనులు జరగకపోవటంతో కబేల శిథిలావస్థకు చేరిందని అధికారులు కచ్చితంగా కబేళను ఉపయోగిస్తామని హామీ ఇస్తేనే పనులు చేయిద్దామని లేకపోతే నిధులు వృధా అవుతాయని అన్నారు. దీనిపై చైర్మన్ రాఘవేంద్ర సమాధానమిస్తూ పట్టణంలో యదేచ్చ గా జంతువులను రోడ్ల పక్కనేఅక్కడే వధించి అమ్మకాలు సాగిస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని నియంత్రించేందుకు కబేళ్లను ఆధునికరించి పశు వైద్యులనుసైతం నియమించి వారుపరిశీలించి ముద్ర వేస్తేనే పట్టణంలో అమ్మకాలు చేసేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. మున్సిపల్ సిబ్బంది కొందరు పనులు చేయకుండానే సెలవులు పెడుతున్నారని ఎప్పుడో వచ్చి మస్టర్ వేయించు కుంటున్నారని దీనితో పనులకు ఇబ్బందులు కలుగుతున్నాయని వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ ప్రశ్నించగా దీనిపై చైర్మన్ రాఘవేంద్ర సమాధానమిస్తూ సిబ్బంది ఫేస్ రికగ్నిషన్ బయోమెట్రిక్ అమలు కానున్నదని దాని ప్రకారం విధులకు హాజరైన దినాల ప్రకారమే వేతనం చెల్లించడం జరుగుతుందని అన్నారు. దీనిపై 14 వ వార్డు సభ్యులు నకరికంటి వెంకట్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అసలు పని చేయకుండానే మస్టర్లు వేసుకొని జీతాలు పొందారని తమ ప్రభుత్వంలో ఆ విధానం కొనసాగదని అన్నారు. మున్సిపల్ కార్మికుల పట్ల తమ ప్రభుత్వం సానుకూల ధోరణితోనే వ్యవహరిస్తుందని గత ప్రభుత్వాలు వారు సమ్మె చేసిన పట్టించుకునే వారు కాదని కానీ తమ ప్రభుత్వంలో మున్సిపల్ కార్మికుల సమ్మెను వెంటనే స్పందించి జీతాలను పెంచడం జరిగిందని వివరించారు. పట్టణంలోని వార్డులలో వీధి దీపాలు సమస్య తీర్చేందుకు 300 లైట్లు తెప్పించామని అవసరమైన కౌన్సిలర్లు వీధి దీపాలను తీసుకోవాలని అలానే మంచినీటి సమస్య వెంటనే తమ దృష్టికి తీసుకొని వస్తే పరిష్కరిస్తామని అన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిల్ సభ్యులు వట్టెం మనోహర్ మాట్లాడుతూ బలుసుపాడు రోడ్డు లోని గురుకుల పాఠశాల నుంచి రాత్రివేళ అత్యవసర పరిస్థితులలో పట్టణంలోకి రావాలంటే వీధి దీపాలు లేక బాలికల తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారని అక్కడ లైట్లు వేయించాలని పలుమార్లు కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. చైర్మన్ రాఘవేంద్ర స్పందిస్తూ బలు సు పాడు రోడ్డులో వీధి దీపాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కౌన్సిల్ సభ్యురాలు వేదు లాపురి అలేఖ్య మాట్లాడుతూ తమ అవార్డులో అనేక సమస్యలు ఉన్నాయని తాము ప్రతి కౌన్సిల్ సమావేశంలోనూ కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చి పోరాడుతున్నామని అన్నారు. గత ప్రభుత్వంలో తాము తమ వార్డు సమస్యలపై ఎ న్ని ఫిర్యాదులు చేసిన పట్టించుకోలేదని తమ ప్రభుత్వం వచ్చాక సమస్యలను పరిష్కరించుకుంటున్నామని అన్నారు. వార్డులో ఖాళీ స్థలాలు పిచ్చి చెట్లు మలిచి ఉన్నాయని అది అక్కడ నివాసం ఉండే వారికి ఇబ్బంది కలుగుతుందని వాటిపై చర్యలు తీసుకోవాలని కౌన్సిల్ సభ్యురాలు అలేఖ్య చైర్మన్ రాఘవేంద్రను కోరారు. కౌన్సిల్ సభ్యు రాలు కె సుందరమ్మ మాట్లాడుతూ తమ వార్డులో బోరు పంపు వద్ద సాయంత్రం అయిందంటే మద్యం తాగేవారు నీటి కోసం వచ్చే మహిళల పట్ల అసభ్యమైన వ్యాఖ్యలు చేస్తూ ఇబ్బంది కలిగిస్తున్నారని దీనిపై చర్యలు తీసుకోవాలని అక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని చైర్మన్ రాఘవేంద్ర కౌన్సిల్ వచ్చిన పోలీస్ అధికారులను ఆదేశించారు. కౌన్సిల్ సభ్యురాలు సుందరమ్మ మాట్లాడుతూ సొంతస్థలంలో ఇల్లు కట్టుకునే వారికి నిధులు ఇస్తామని సంవత్సరాల నుంచి చెబుతున్నారని ఇంతవరకు నిధులు మంజూరు కాలేదని ప్రభుత్వం వచ్చి ఏడాది అయిన సొంత స్థలాల్లో ఇల్లు కట్టుకునే వారికి నిధులు రాకపోవడంపై పలువురు ఆక్షేపణ వ్యక్తం చేస్తున్నారని వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరారు.కో ఆప్షన్ సభ్యులు ఖాదర్ బాబు, 31 వ వార్డు సభ్యులు గింజపల్లి వెంకట రామయ్యలు పట్టణంలో యదేచ్చగా ప్లాస్టిక్ కవర్లు అమ్ముతున్నారని దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు వట్టెం మనోహర్ మాట్లాడుతూ మున్సిపాలిటీకి పెద్ద మొత్తంలో నిధులు రానున్నందున సకాలంలో టెండర్లు పిలిచి పనులను వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు . చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ వచ్చే నెలలో పెద్ద మొత్తంలో నిధులు రానున్నాయని ఆ నిధులతో వెంటనే టెండర్లు పిలిచి అభివృద్ధి కార్యక్రమాలను శ్రీకారం చుట్ట నున్నట్లు వివరించారు. మూడవ వార్డు కౌన్సిల్ సభ్యురాలు కాశి అనురాధ మాట్లాడుతూ వార్డులో వీధి కుక్కల సమస్య తీవ్రంగా ఉందని దీనిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తులసి కృష్ణ రావు, మున్సిపల్ అధికారులు కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

### కంపోస్ట్ యార్డ్ సమస్యకు పరిష్కారం

పట్టణంలోని ముత్యాల రోడ్డులో తీవ్ర సమస్యగా ఉన్న కంపోస్టు యార్డు సమస్యకు వచ్చే నెలలో పరిష్కారం లభించనున్నదని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర వివరించారు. కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే నెలలో లెగసి వేస్ట్ క్లియర్ కోసం ప్రాజెక్ట్ ప్రారంభించనున్నారని సుమారు 60 లక్షల రూపాయల కేంద్ర ప్రభుత్వ నిధులతో కంపోస్టు యార్డును ఆధునికరించే పనులకు వచ్చే నెలలో శ్రీకారం చుట్టనున్నట్లు స్వచ్చం ద్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి నుంచి సమాచారం అందినట్లు కౌన్సిల్ సమావేశంలో చైర్మన్ రాఘవేంద్ర వివరించారు.

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి

మొదటి పేజీ తరువాయి...



**మచిలీపట్నం, జులై 30(మనం న్యూస్):** ప్రకాశం బ్యారేజీ లో వరద నీటి ప్రవాహం రాను రాను పెరుగుతున్న దృష్ట్యా అధికారులు చాలా అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ ఆదేశించారు. బుధవారం సాయంత్రం జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ నగరంలోని వారి చాంబర్ నుండి క్షేత్రాధికారులతో వరదలపై టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ ప్రకాశం బ్యారేజీకి 3 లక్షల క్యూసెక్కుల వరద నీటి వివాహం వచ్చే అవకాశం ఉందని, 2 అడుగుల మేరకు అన్ని గేట్లను ఎత్తివేసి వరద నీటిని క్రిందకు వదిలారని, ఆ నీరు పూర్తి ఒరవడితో దిగువన ఉన్న కృష్ణాజిల్లాలోకి వస్తోందన్నారు.క్షేత్రాధికారులందరూ వారి ప్రధాన కేంద్రాల్లో అందుబాటులో ఉండి వరదనీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. సిబ్బందికి ఎవరికైనా సెలవులు ఇచ్చి ఉంటే వాటిని వెంటనే రద్దుచేసి విధులకు హాజరుకావాలని ఆదేశించారు. జలవనరుల శాఖ అధికారులు కాలువల వద్ద గట్టి నిఘా ఉంచి వరదనీటి స్థాయిని ఎప్పటికప్పుడు గమనించుకోవాలన్నారు. కృష్ణా నది పరివాహక ప్రాంతాల్లో అన్ని గ్రామాల్లో దండోరా వేయించి లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఇందుకోసం గ్రామ రెవెన్యూ అధికారులకు, గ్రామ సచివాలయ సిబ్బందికి వెంటనే వరద సమాచార సందేశాన్ని పంపించి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వారిని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నారు. జిల్లా కేంద్రంలో వెంటనే ఒక కంట్రోల్ విభాగాన్ని ఏర్పాటుచేసి తగిన చర్యలు తీసుకునే విధంగా పనిచేయాలని సూచించారు.మండల ప్రత్యేక అధికారులు వారి మండలాల్లోని గ్రామాలను సందర్శించి వరద పరిస్థితులను తెలుసుకోవాలన్నారు. వరద ఉధృతి ఆకస్మాత్తుగా పెరిగే అవకాశం ఉన్నందున ఈతకు వెళ్లే వారిని వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.రెవెన్యూ డివిజనల్ అధికారులు డిఎస్పి లతో సమన్వయం చేసుకొని వరద పరిస్థితులను గమనించి ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్లో డిఆర్ఓ కే చంద్రశేఖర రావు, ఆర్డీవోలు, తహసీల్దారులు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు, జలవనుల శాఖ అధికారులు పాల్గొన్నారు.

## గృహ నిర్మాణ పురోగతిని పెంచాలి: హౌసింగ్ పిడి పోతురాజు



**ఉయ్యూరు జులై 30 ( మనం న్యూస్):** ఉయ్యూరు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారంనాడు గృహ నిర్మాణ పురోగతి పెంచేందుకై జిల్లా హౌసింగ్ పిడి జి. పోతురాజు ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు, పంచాయితీ కార్యదర్శులకు సమీక్షా సమయంలో పాల్గొన్నారు. గత ప్రభుత్వంలో కాలనీలలో ఇళ్ళ స్థలము పొంది ఇప్పటికి ఇళ్ళ నిర్మాణం చేపట్టని లబ్దిదారులకు ఇంకా నిర్మాణము చేయడానికి గడువు వున్నదని ఈలోపు గృహ నిర్మాణం చేసుకోవాలని జిల్లా హౌసింగ్ అధికారి శ్రీ జి. పోతురాజు ఇంజినీరింగ్ సిబ్బందికి పంచాయితీ కార్యదర్శులకు సూచించారు. ఇళ్ళ నిర్మాణము చేపట్టి పూర్తి చెయ్యని లబ్దిదారులు వద్ద నుండి ప్రభుత్వం నుండి యిచ్చిన అడ్వాన్స్ లు, అదనపు సహాయం సొమ్ములను రికవరీ చట్టం ద్వారా రికవరీ చేయవలసి చేయవలసి ఉంటుందని హెచ్చరించారు. ఇంకా ఇళ్ళ నిర్మాణము మొదలుపెట్టని లబ్దిదారులకు నోటీసులు ఇచ్చి స్థలము స్వాధీనం చేసుకోవలసి వుటుందని తెలిపారు. లబ్దిదారులు వెంటనే ఇళ్ళ నిర్మాణము పూర్తి చేయలసినదిగా తెలియజేసినారు. ఈసమావేశంలో ఇఇ వెంకటేశ్వరరావు, డిఇఇ రమేశ్ బాబు, ఎంపీడీవో జిఎస్ వి శేషగిరి రావు పాల్గొన్నారు.

## ఎస్పిసి, ఇన్చార్జ్ఞో ఇక్కట్లు- పనులు జరుగక ప్రజల ఇబ్బందులు



**ఉయ్యూరు, జులై 30 (మనం న్యూస్):** ఉయ్యూరు నగరపంచాయతీలో కమిషనర్, శానిటరీ ఇన్స్పెక్టర్తో పాటు ఇతర పోస్టులు రోజులతరబడి ఖాళీగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జూన్ వరకు కమిషనర్ గా పనిచేసిన పి.వెంకటేశ్వరరావు జూన్ 30న ఉద్యోగ విరమణ చేయగా, శానిటరీ అసిస్టెంట్ బదిలీపై వెళ్లారు. వీరితోపాటు రెవిన్యూ అసిస్టెంట్ పనిచేసిన వ్యక్తి పలు కారణాలతో దాదాపు రెండు నెలల క్రితం సస్పెండ్ అవ్వగా, మరికొన్ని పోస్టులు ఎప్పటినుంచో ఖాళీగా ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో కమిషనర్ ఉద్యోగి విరమణతో ఎఫ్ఎసీ కమిషనర్ ఎన్విరాల్మెంటల్ అసిస్టెంట్ ఇంజనీర్కు బాధ్యతలు అప్పగించారు. అదేవిదంగా వార్డు సచివాలయ శానిటేషన్ సెక్రటరీకి శానిటేషన్ ఇన్చార్జ్ గా బాధ్యతలు అప్పగించారు. చార్జ్ బాధ్యతలు అప్పగించడం వల్ల ఏవిభాగానికి సరైన సమయం కేటాయించలేక ఉద్యోగులు అవస్తలు పడుతుండగా, అధికారుల పర్యవేక్షణ కొరవడి సత్వర సేవలందక ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. కమిషనర్ రిటైర్ అయి నెల రోజులు కావస్తున్నా కొత్తకమిషనర్ ను నియమించ కోపవడం పట్ల అలు ఆరోపణలు వినవస్తున్నాయి. తనకు అనూకూలంగా ఉండే వారి కోసం చైర్మన్ గట్టిగా ప్రయత్నిస్తున్నట్టు సమాచారం కాగా ఎమ్మెల్యే ఈవిషయంలో ఆలోచించి నిర్ణయం తీసుకుంటారని పార్టీ వర్గాల సమాచారం.

## నందిగామలో కాలువ పూడికతీత పనులకు శంకుస్థాపన



- ఏపీ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

**నందిగామ, జులై 31,(మనం న్యూస్):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పట్టణ అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా, నందిగామ పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్లో ఉన్న బాబు జగజీవన్ రామ్ బిల్డింగ్ వద్ద రూ.15 లక్షల వ్యయంతో కాలువ (షిల్ట్) పూడికతీత పనులకు శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, మున్సిపల్ చైర్పర్సన్ మండవ కృష్ణకుమారి, మున్సిపల్ కమిషనర్తో పాటు కూటమి నేతలు కలిసి కొబ్బరికాయ కొట్టి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ నందిగామ పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధికి ఈ కాలువ పూడికతీత పనులు కీలకమైనవని తెలిపారు. 'పట్టణంలో శుభ్రత, పరిశుభ్రతను మెరుగుపరచడంతోపాటు, వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలను తగ్గించేందుకు ఈ పనులు దోహదపతాయనీ, ప్రజల సౌకర్యం కోసం మా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది,' అని ఆమె అన్నారు. ఈ పనులకు రూ.15 లక్షల నిధులను ఆర్థిక శాఖ (ఫైనాన్స్ డిపార్ట్మెంట్) ద్వారా మంజూరు చేయడం జరిగిందని ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లోవ రాజ్, స్థానిక కూటమి నేతలు, అధికారులు మరియు పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ పనులు పూర్తయితే, నందిగామలో డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపడడంతోపాటు, పట్టణం మరింత శుభ్రంగా, ఆరోగ్యకరంగా మారనుంది. ఈ కార్యక్రమం స్థానికుల నుండి సానుకూల స్పందనను రాబట్టింది.

# ఆక్రమణల చెరలో తిమ్మరుసు బావి

**మొదటి పేజీ తరువాయి**

రాజులు పోయారు, రాజ్యాలు పోయాయి. కానీ వారు విడిచి వెళ్లిన గురుతులు మన మధ్యలోనే ఉన్నాయి. అలాంటి గురుతులను రాబోయే తరాలకు అందించాల్సిన భాధ్యత మనందరిపైన ఉంది. అటువంటి గురుతు తిమ్మరుసు బావి. క్రీ.శ. 14వ శతాబ్దంలో కొండపల్లి రాజ్యాన్ని పాలించిన శ్రీకృష్ణదేవరాయల ఆస్తానంలో ఉన్న ప్రధాన మంత్రి తిమ్మరుసు స్వయంగా త్రవ్వించిన పురాతన కాలానికి చెందిన బావి ఇబ్రహీంపట్నంలో ఉంది. ఆ బావి గురించి చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించారు చరిత్రకారులు. కొండపల్లి చారిత్రిక చరిత్ర అనే గ్రందంలో ఇబ్రహీంపట్నాన్ని గజపతుల నుండి స్వాదీనం చేసుకునేందుకు ఇబ్రహీంపట్నంలో సుమారు 6 నెలల కాలం పాటు విడిది చేసిన శ్రీకృష్ణదేవరాయల వారు ప్రస్తుత రింగు సెంటర్ సమీపంలో వారు నివసించారని చరిత్ర చెబుతుంది. అదే సమయంలో తాను , తన పరివారానికి త్రాగు నీటి కోసం తిమ్మరుసు ఓ బావిని త్రవ్వించారు. ఆ తరువాత కాలంలో ఆ బావి నీటిని పరిసర గ్రామాల ప్రజలు కూడా త్రాగారని తెలుస్తోంది. కానీ ప్రస్తుతం అమ్మవారి సంప్రోక్షణకు కూడా పనికి రాకుండా పోయాయి. చుట్టు ప్రక్కల 18 గ్రామాల నుండి వచ్చి,పోయే బాట సారులు త్రాగు నీటికై వాడిన భావిని ప్రస్తుతం పూడ్చాలనే కుట్రలు జరుగుతున్నాయని ఆంధోళన వ్యక్తం చేస్తున్నారు. ఇబ్రహీంపట్నంలోని ఆర్.యస్. నెం. 226/2 పురావస్తు శాఖకు చెందిన ఈ బావి ప్రస్తుతం ఆక్రమణల చెరలో ఉంది. ఉప్పుతల వారి గోత్రికుల చేత ప్రతిష్టించబడిన శ్రీమహాలక్ష్మి దేవాలయంలో ఏడాదికి ఒక సారి కొలుపులు కూడా జరుగుతాయని ఇబ్రహీంపట్నానికి చెందిన ఉప్పుతల వెంకటలక్ష్మీ అనే మహిళ చెబుతున్నారు. ఇబ్రహీంపట్నం ఆర్.యస్.నెం.226/2 రు దాఖలా విస్తీర్ణం య. 0-38 సెంట్లు, ఖాతా నెంబరు 20000519, ఇబ్రహీంపట్నం మండలం, కృష్ణాజిల్లా ఆర్.ఓ.ఆర్.నెం. 012041420966 గా రెవిన్యూ వర్గీకరణలో ల్యాండ్ క్లాసిఫికేషన్ పోరంబోకు స్థలం ఈ సదరు స్థలములో గల శ్రీమహాలక్ష్మి అమ్మవారి గ్రామదేవతను గత 50 సం||ల నుండి కూడా అచ్చట గల వేపచెట్టువద్ద ఆధ్యాత్మిక బృందం వారిచేత బోనాలు పండుగలు ఇత్యాది సంస్కృతులు వెల్లివిరిసే లాగున తిర్నాలలు జరుగుతున్నవని ఆమె పేర్కొన్నారు. 24 సం||ల నుండి ఉప్పుతల వెంకటలక్ష్మి వారి స్వంత ఖర్చులతో జాతర నిర్వహణ జరుగుతున్నవని తెలిపారు. దేవాలయ కమిటీవారి ర్యవేక్షణలో ఉప్పుతల, దేవళ్ళ, బండారు, బత్తుల వారి గోత్రకర్తలు పర్యవేక్షణలో సదరు రాయల సంస్థానానికి వెంటనే తిమ్మరుసు బావి (నుయ్యి) గల పురావస్తు శాఖవారి అధ్వర్యాన తక్షణ చర్యలు చేపట్టి సదరు స్థలంలో ఉన్న ఆక్రమణలు తొలగించాలని ఆమె కోరుతున్నారు. నాయకులు, అధికారులు, గ్రామ పెద్దలు ఈ సమస్య పైన స్పందించి తిమ్మరుసు బావిని కాపాడాలని ఆలయ పరిరక్షణ, అభివృద్ధి కమిటీ వారు కోరుతున్నారు.



# ప్రతి బ్యాంకు బ్రాంచ్లోనూ క్రెడిట్ డే నిర్వహించాలి

**మొదటి పేజీ తరువాయి**

సీసీఆర్సీ కార్డులున్న ప్రతి అన్నదాతకూ సత్వరం పంట రుణాలు మంజూరు చేయాలనిఇందుకు ప్రతి బ్యాంకు బ్రాంచ్లో క్రెడిట్ డే నిర్వహించాలని ఎన్టీఆర్ జిల్లా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ బ్యాంకర్లకు సూచించారు. సీసీఆర్సీ కార్డులున్న కౌలు రైతులకు సాగు రుణాల మంజూరుపై కలెక్టర్ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియతో కలిసి బుధవారం కలెక్టరేట్లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌలు రైతులకు 56 వేల సీసీఆర్సీ కార్డుల జారీ లక్ష్యం కాగా ఇప్పటికే 42,415 కార్డులు అందించడం జరిగిందని, ఈ నేపథ్యంలో వారికి సత్వరం బ్యాంకులు రుణాలు అందించేందుకు చొరవ చూపాలన్నారు. రుణాలు పొందడం వారి హక్కు అని.. దీన్ని దృష్టిలో ఉంచుకొని బ్యాంకులు.. బ్రాంచుల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేందుకు కృషిచేయాలన్నారు. సీసీఆర్సీ రుణాల మంజూరు అనేది బ్యాంకుల పనితీరుకు కీలక ప్రగతి సూచిక అని.. ఇందులో మెరుగైన పనితీరు కనబరిచిన బ్యాంకులు, బ్రాంచులకు తగిన గుర్తింపు ఇవ్వడం జరుగుతుందన్నారు. స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక రంగ వృద్ధికి, రైతులు, కౌలు రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యమిస్తోందని పేర్కొన్నారు. చాలా అంశాల్లో ఎన్టీఆర్ జిల్లా ముందంజలో ఉంటోందని, సీసీఆర్సీ కార్డులపై రుణాల మంజూరులోనూ జిల్లాను ముందు వరుసలో నిలపడంలో బ్యాంకులు భాగస్వాములు కావాలన్నారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు కూడా కౌలు రైతులు పంట రుణాలు పొందడంలో సహాయసహకారాలు అందించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. తుపాన్లు, కరువు, అకాల వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు వివిధ పంటలకు బీమా పరిహారం పొందేందుకు అందుబాటులో ఉన్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్బీవై), పునర్నిర్మించిన వాతావరణ ఆధారిత పంట బీమా పథకం (ఆర్డబ్ల్యూబీసీఐఎస్)ను రైతులు స్వచ్ఛందంగా సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. వ్యవసాయ భూమి కలిగిన యజమానులు, సీసీఆర్సీ కార్డులు పొందిన సాగుదారులు పథకాల్లో చేరేందుకు అర్హులని వివరించారు. బ్యాంకుల నుంచి పంట రుణం పొందిన రైతులకు రుణంతో పాటు విజ్ఞప్తి మేరకు బీమా ప్రీమియం కూడా మంజూరు చేయడం జరుగుతుందని.. అదేవిధంగా పంట రుణం తీసుకోని రైతులు కామన్ సర్వీస్ సెంటర్లు (సీఎస్సీ), బ్యాంకుల్లో ప్రీమియం చెల్లించి, జాతీయ పంట బీమా పోర్టల్ (ఎన్సీఐపీ)లో నమోదు చేసుకొని పథకంలో చేరవచ్చని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయ కుమారి, ఎల్డీఎం కె.ప్రియాంక, డీఆర్డీఏ పీడీ ఏఎన్వీ నాంచారరావు, వివిధ బ్యాంకుల కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.




# యువత కోసం విస్తృతంగా జాబ్ మేళాలు

- ఆగస్ట్ 6వ తేదీ అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా
- పోస్టర్లు ఆవిష్కరించిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

**అవనిగడ్డ, జులై 30 (మనం న్యూస్) :** నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృతంగా జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. బుధవారం అవనిగడ్డలోని తమ కార్యాలయంలో జాబ్ మేళా పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆగస్టు 6వ తేదీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏ.పీ.ఎస్.ఎస్.డీ.సీ) ఆధ్వర్యంలో జాబ్ మేళా జరుగుతుందని తెలిపారు. ఈ జాబ్ మేళాను నియోజకవర్గ యువతి యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు తదితరులు పాల్గొన్నారు



# కృష్ణా నది వరదలపై పూర్తి అప్రమత్తంగా ఉన్నాం

- ప్రజలు ధైర్యంగా, జాగ్రత్తగా ఉండాలి
- వరదలపై వదంతులను నమ్మవద్దు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ పశ్చిమ, జూలై 30 (మనం న్యూస్):** ఎగువన వర్షాలు పడటంతో పులిచింతల నుంచి 60 వేల క్యూసెక్కులుకు పైగా వరద నీరు రావడంతో.. ప్రకాశం బ్యారేజీ 70 గేట్లలో 55 గేట్లను అడుగుపైకి, 15 గేట్లను రెండు అడుగులు పైకి ఎత్తి నీటిని కిందకు వదిలేయడం జరుగుతోందని.. వరదల నేపథ్యంలో పూర్తి అప్రమత్తంగా ఉన్నామని, అధికారులను కూడా అప్రమత్తం చేసినట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. బుధవారం సాయంత్రం కలెక్టర్ లక్ష్మీశ ప్రకాశం బ్యారేజీ వద్ద వరద పరిస్థితిని పరిశీలించారు. అధికారుల నుంచి వరద నీటి ప్రవాహానికి సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గురువారం ఉదయం నాటికి లక్ష క్యూసెక్కులకు, రెండు రోజుల్లో మూడు లక్షల క్యూసెక్కులకు చేరుకునే అవకాశముందని, ఈ నేపథ్యంలో కృష్ణానది పరీవాహక ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేసినట్లు వెల్లడించారు. ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, మునిసిపల్ తదితర శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉన్నారని.. బ్యారేజీ ఎగువ, దిగువ వైపుల ఉన్న గ్రామాల ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించినట్లు తెలిపారు. ముఖ్యంగా మత్స్యకారులను చేపల వేటకు వెళ్లకుండా అవగాహన కల్పించామన్నారు. విజయవాడలో దాదాపు 43 లోతట్టు ప్రాంతాలను గుర్తించామని.. వీటిని ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా సమీపంలో పునరావాస కేంద్రాలతో మ్యాప్ చేసినట్లు తెలిపారు. ఒకవేళ ముంపు ముప్పు ఉన్నట్లయితే ఈ కేంద్రాలను తరలిస్తామని వివరించారు. డ్రెయినేజీ వ్యవస్థలు సరైన విధంగా ఉండేలా నగర పాలక సంస్థ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. బుడమేరు, పులివాగు, కోతుల వాగు తదితర ప్రాంతాల విషయంలోనూ అప్రమత్తంగా ఉన్నామన్నారు. వరదలపై జిల్లా కలెక్టరేట్లో 91549 70454 నంబరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని.. ఇది 24 గంటలూ పనిచేస్తుందని, ఎవరైనా సమస్యలను కంట్రోల్ రూమ్ దృష్టికి తీసుకొస్తే వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచడం జరిగిందని.. వచ్చే రెండు రోజుల పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. భయపడాల్సిన పనిలేదని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. కృష్ణా జిల్లా కలెక్టర్, అధికార యంత్రాంగంతోనూ సమన్వయం చేసుకుంటున్నామని తెలిపారు. కలెక్టర్ వెంట ఇరిగేషన్ ఎస్ఈ ఆర్.మోహనరావు, ఈఈ ఆర్.రవికిరణ్, డీఈ ఎన్.అజయ్బాబు, బ్యారేజ్ జేఈ సత్య రాజేష్ తదితరులు ఉన్నారు.

